క్లుప్తంగా

నేటితో ముగియనున్న ప్రత్యేక ఆధార్‌ శిబిరాలు


జేడీ శివప్రసాద్‌

సీతమ్మధార : జీవీఎంసీ జోన్‌ – 3 పరిధిలో ఎంపిక చేసిన సచివాలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్‌ నమోదు శిబిరాలు గురువారంతో ముగియనున్నాయని జోనల్‌ కమిషనర్‌ కె.శివప్రసాద్‌ తెలిపారు. ఆయన జోనల్‌ కార్యాలయంలో బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు. ఈ నెల 21 నుంచి ప్రారంభించిన శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. పుట్టినప్పటి నుంచి ఇంతవరకు ఆధార్‌కార్డు తీసుకోని పిల్లలకు ఈ శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. తూర్పు నియోజకవర్గం పరిధి 15వ వార్డు పాత వెంకోజీపాలెంలో గల 106వ నంబర్‌ సచివాయంలో, మద్దిలపాలెంలోని 117వ నంబరు సచివాలయంలో శిబిరాలు కొనసాగుతున్నాయన్నారు. ఉత్తర నియోజకవర్గంలోని అక్కయ్యపాలెం దరి లలితానగర్‌లో గల 125వ నంబరు సచివాలయంలో, పాత రేసపువానిపాలెంలో గల 138వ నంబర్‌ సచివాలయంలో ఆధార్‌ నమోదు చేస్తున్నారని తెలిపారు. దక్షిణ నియోజకవర్గంలోని దొండపర్తిలో గల 143వ నంబర్‌ సచివాలయంలో శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇండియన్‌ రెడ్‌ క్రాస్‌ హోం సందర్శన


నిరాశ్రయులతో మాట్లాడుతున్న వెంకట శేషమ్మ

బీచ్‌రోడ్డు : పెదవాల్తేరులో ఉన్న ఇండియన్‌ రెడ్‌ క్రాస్‌ సొసైటీ పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని డిస్ట్రిక్‌ లీగల్‌ సర్వీస్‌ అథారిటీ కార్యదర్శి వెంకట శేషమ్మ బుధవారం సందర్శించారు. నిరాశ్రయులతో కొద్దిసేపు మాట్లాడారు. వారికి అందిస్తున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెతోపాటు జీవీఎంసీ యూసీడీ పీడీ సత్యవేణి, ఏపీడీ రాము ఉన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. ఎంవీపీ కాలనీ సెక్టార్‌ – 9 అప్పుఘర్‌కు చెందిన మీసాల విజయలక్ష్మి తన సోదరి జమ్ము లక్ష్మి బుధవారం తెల్లవారుజాము నుంచి కనిపించడం లేదంటూ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివిధ కారణాలతో ఆమెను ఈ నెల 24న గుంటూరు నుంచి అప్పుఘర్‌ తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆమె బుధవారం తెల్లవారుజాము నుంచి కనిపించకుండా పోయినట్లు పేర్కొన్నారు. విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

7.2 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని బుధవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌ ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ అబ్దుల్‌ మారూఫ్‌, సీఐబీ/వాల్తేర్‌/ఆర్పీఎఫ్‌ ఏఎస్‌ఐ పిఎంకుమార్‌ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఒడిశా రాష్ట్రంలోని రాయగడ జిల్లాకు చెందిన సుశాంత్‌నాగ్‌, రాజకుమార్‌ విశాఖపట్నం రైల్వేస్టేషన్‌ మీదుగా కేరళకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 7.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం


అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం అర్చకుడు శ్రీనివాస్‌ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి స్వయంగా జలాభిషేకం నిర్వహించారు. అర్చకుడు భక్తుల గోత్ర నామాలతో విశేష పూజలు జరిపించారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఆలయ వర్గాలు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

హైవే దాటాలంటే.. దడ


కృష్ణా కళాశాల జంక్షన్‌

- ప్రమాదాలకు గురవుతున్న పాదచారులు
- అమలు కాని ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణ హామీ
- మద్దిలపాలెం కాంప్లెక్స్‌కు వెళ్లాలంటే భయం


మద్దిలపాలెం కూడలిలో రోడ్డు దాటుతున్న పాదచారులు


రోడ్డు దాటేందుకు పరుగులు పెడుతున్న పాదచారులు


మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌ రోడ్డులో వాహనాల రద్దీ

మద్దిలపాలెం: స్థానిక జాతీయ రహదారిపై అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు వెళ్లాలంటే పాదచారులు హడలిపోతున్నారు. హైవే దాటేందుకు నిర్మించ తలపెట్టిన కాలిబాట వంతెన (ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి) నిర్మాణం హామీ అటకెక్కడంతో నిత్యం రద్దీగా ఉండే మద్దిలపాలెం జంక్షన్‌ పాదచారులను టెన్షన్‌కు గురి చేస్తోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్‌ విపరీతంగా ఉండడంతో రాకపోకలు సాగించేందుకు జనం నానా అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి బస్టాప్‌ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, కూలి పనులకు వెళ్లే బాటసారులతో కిటకిటలాడుతోంది. ఆయా సమయాల్లో వాహనాల రాకపోకతో రద్దీగా ఉంటుంది. దీంతో రోడ్డు దాటడానికి పాదచారులు నానా హైరానా పడుతున్నారు. వృద్ధులు, వికలాంగుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. రయ్‌రయ్‌మంటూ దూసుకెళ్లే వాహనాలను దాటి వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుందని జనం వాపోతున్నారు. కనీసం రద్దీ సమయంలోనైనా రోడ్డు దాటే మార్గంలో ట్రాఫిక్‌ పోలీసులు ఉంటే ప్రమాదాల భయం తప్పుతుందని అంటున్నారు.

తప్పని అవస్థలు..

విపరీతమైన ట్రాఫిక్‌ వల్ల మద్దిలపాలెం డిపో నుంచి బయటికి వచ్చే ప్రయాణికులు కళాభారతి వైపు వెళ్లేందుకు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా ఏయూ ఇంజినీరింగ్‌ కాలేజీ, రామా టాకీసు వైపు వెళ్లే రోడ్డులోకి వెళ్లేందుకు కూడా అవస్థలు పడుతున్నారు.

రోడ్డు దాటాలంటే భయం..

మద్దిలపాలెం నుంచి కళాభారతి వైపు జాతీయ రహదారిని దాటాలంటే ప్రాణాలు గుప్పిట పెట్టుకోవాల్సి వస్తుంది. నిత్యం వాహనాల రద్దీతో రోడ్డు దాటలేకపోతున్నాం. తప్పనిసరి పరిస్థితిలో ధైర్యం చేసి దాటుతున్నాం. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలి. విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉంది.

– ఎస్‌.ఎం.రెడ్డి, మద్దిలపాలెం

ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి నిర్మించాలి..

ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు. మద్దిపాలెంలో ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా నాయకుల హామీలు నీటి మూటగానే మిగిలిపోయాయి.

– ఎస్‌.సురేష్‌బాబు, శివాజీపాలెం

హెచ్‌బీ కాలనీలో బడ్డీల తొలగింపు


అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలు తొలగింపజేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మద్దిలపాలెం : రోడ్లు ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలను ఎట్టకేలకు జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది తొలగించారు. రోడ్లపై ఇష్టారాజ్యంగా బడ్డీలు ఏర్పాటు చేసి కొందరు అద్దెకిచ్చి సొమ్ము చేసుకుంటున్నారనే విషయంపై జీవీఎంసీ టౌన్‌ ప్లానింగ్‌ అధికారులకు పలువురు ఫిర్యాదు చేసినా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అయితే పారిశుధ్య సిబ్బంది మాత్రం తమకు అడ్డంగా ఉన్న బడ్డీలను బుధవారం తొలగించారు. జీవీఎంసీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ నుంచి క్రిష్టా కళాశాల మార్గంలో అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలు తొలగించారు. జోన్‌ – 3 జోనల్‌ కమిషనర్‌ శివప్రసాద్‌ ఇటీవల ఈ ప్రాంతంలో పర్యటించారు. ఇక్కడ సులభ్‌ కాంప్లెక్స్‌ ఎదురుగా ఆటో స్టాండ్‌ పక్కనున్న చెత్త కుండీని ఆనుకుని అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలను వెంటనే తొలగించమని ఆదేశించారు. అయితే వాటిని తొలగించాల్సిన టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు జోనల్‌ కమిషనర్‌ ఆదేశాలను బేఖాతరు చేశారు. దీంతో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ సూరిబాబు, సచివాలయం సిబ్బంది మాత్రం స్పందించి బడ్డీలు తొలగించారు. దీంతో టౌన్‌ప్లానింగ్‌ అధికారులు, సిబ్బంది తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వార్డులో ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా షరా మామూలుగా వదిలేస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

చెత్త తొలగింపు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డులోని భానూజీనగర్‌లో పేరుకుపోయిన చెత్తను జీవీఎంసీ సిబ్బంది బుధవారం తొలగించారు. మరగుదొడ్ల సమీపంలో చెత్త పేరుకుపోవడంతో స్థానికులు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావుకు ఫిర్యాదు చేశారు. ఆయన జీవీఎంసీ అధికారులతో మాట్లాడి చెత్త తొలగింపజేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలలతో స్నేహంగా మెలగాలి


వంట గదిలో పరిశీలిస్తున్న బాలల హక్కుల కమిషన్‌ చైర్మన్‌ కేసలి అప్పారావు

ఆరిలోవ : దీన్‌దయాల్‌పురం వద్ద ప్రభుత్వ బాలల పరిశీలన గృహాన్ని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్‌ చైర్మన్‌ కేసలి అప్పారావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడి సూపరింటెండెంట్‌ వీరయ్యతో మాట్లాడి గృహంలో బాలల సంఖ్య, సిబ్బంది సంఖ్య తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం సిద్ధం చేస్తున్నారో..? లేదో..? పరిశీలించారు. ఆహారం రుచి చూశారు. బాలలతో మాట్లాడి భోజనం, వసతులు గురించి ఆరా తీశారు. బాలలు క్రమశిక్షణ అలవరచుకోవాలని సూచించారు. గృహం సిబ్బంది బాలలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. గృహంలో సిబ్బంది ఖాళీల భర్తీ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

యూజీడీ మరమ్మతులకు వినతి


వినతిపత్రం అందిస్తున్న పల్లా దుర్గారావు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డులోని రామ్‌నగర్‌ ప్రాంతంలో యూజీడీ వ్యవస్థ అధ్వానంగా తయారవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరమ్మతులు చేపట్టాలని జీవీఎంసీ చీఫ్‌ ఇంజినీర్‌ శివప్రసాద్‌ను వైఎస్సార్‌ సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు కోరారు. ఈ మేరకు బుధవారం జీవీఎంసీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే వార్డులో స్పీడ్‌ బేకర్లు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయిని, స్పీడ్‌ బేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై శివప్రసాద్‌ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో క్రైస్తవులపై పెరిగిన దాడులు

- బొల్లవరపు జాన్‌ వెస్లీ


సీడీ విడుదల చేస్తున్న జాన్‌వెస్లీ

సీతమ్మధార: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రైస్తవులపై దాడులు పెరిగిపోయాయని, అందరం కలిసి ఎదుర్కొందామని వైఎస్సార్‌ సీపీ క్రిస్టియన్‌ మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌ వెస్లీ పిలుపునిచ్చారు. గురుద్వార దగ్గర గల ఎన్‌సీకే క్రైస్ట్‌ చర్చిలో బుధవారం నేషనల్‌ ఇండిపెండెంట్‌ బిషప్‌ కౌన్సిల్‌ (నిబ్‌) 24వ రాష్ట్రస్థాయి క్రైస్తవ నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎన్‌ఐబీ ఫౌండర్‌, అధ్యక్షుడు కాట్రగడ్డ మార్టిన్‌ మాట్లాడుతూ 24 ఏళ్లుగా వివిధ రాష్ట్రాల్లో నిబ్‌ ఆధ్వర్యంలో చేసిన సేవలను వివరించారు. రెవరెండ్‌ మార్టిన్‌ లూథర్‌ దామెర మాట్లాడుతూ ఏసు దైవ గుణాలను, క్రైస్తవ్యం సిద్ధాంతాలను ఏ విధంగా అనుసరించాలో తెలియజేశారు. ఈ సందర్భంగా జాన్‌ వెస్లీ మాట్లాడుతూ క్రైస్తవ్యం అంటే కృతజ్ఞతకు చిహ్నం అని అన్నారు. ఈనెల 26న శ్రీకాకుళం జిల్లా సోంపేటలో కల్వర్‌ బాప్టిస్ట్‌ చర్చి సభ్యులపై జరిగిన దాడి, తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలంలో పాస్టర్‌ చింతాడ రాజారెడ్డిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా క్రైస్తవులందరూ తమ హక్కుల కోసం ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. క్రైస్తవ సంఘ కాపరులకు 8 నెలలుగా గౌరవ వేతనం, జెరూసలేం వెళ్లే యాత్రికులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయాలన్నారు. అనంతరం క్రైస్తవ గీతాల సీడీని జాన్‌ వెస్లీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అతిథులను సత్కరించారు. రెవరెండ్‌ ఎం.ఎ. పాల్‌, నిబ్‌ ఏపీ సెక్రటరీ బిషప్‌ ముక్తిపూడి సత్యకిరణ్‌, ఎం.అనిల్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌సిటీలో పశువుల సంచారం


హెల్త్‌ సిటీ లోపల సంచరిస్తున్న ఆవులు

ఆరిలోవ: స్థానిక హెల్త్‌ సిటీలో పశువుల సంచారం పెరిగిపోయింది. ఇక్కడి రోడ్లపై రోజూ ఆవులు, గేదెలు సంచరిస్తున్నాయి. రోడ్ల పక్కన పచ్చిక, పచ్చని మొక్కలను మేస్తూ తిరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం ఇవి గుంపులుగా రోడ్డు మధ్యలో తిరుగుతూ రోగులు, వారి బంధువుల వాహనాలకు అడ్డం పడుతున్నాయి. పశువుల యజమానులు వాటిని మేత కోసం ఉదయం పూట రోడ్డు మీదకు విడిచిపెట్టేస్తున్నారు. అవి రోడ్డుపై ఇష్టానుసారం సంచరిస్తున్నాయి. ఇక్కడ పినాకిల్‌, శుశ్రుత, క్యూ1, ఎంవీ, రెయిన్‌బో చిల్డ్రన్‌ ఆస్పత్రి, మెడికవర్‌ తదితర 15కు పైగా ఆస్పత్రులు నిర్వహణలో ఉన్నాయి. సాధారణంగా ఇవి నిత్యం రోగులతో నిండిపోతుంటాయి. ఆయా ఆస్పత్రులకు వెళ్లే రోగులు, వారిని తీసుకెళ్లే బంధువుల వాహనాలకు ఈ పశువులు ఇబ్బందిగా మారాయి. వీటి వల్ల ఇబ్బంది పడుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హెల్త్‌సిటీ సంఘం ఇక్కడ సెక్యూరిటీ నిర్వహించడంలేదు. హెల్త్‌సిటీ లోపలికి ప్రవేశించడానికి మూడు రహదారులు ఉన్నాయి. ఆయా రహదారుల వద్ద ముగ్గురు సెక్యూరిటీ సిబ్బందిని నియమిస్తే లోపలికి పశువులు ప్రవేశించకుండా నిరోధించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థులకు అవగాహన యాత్ర


ఎర్రమట్టి దిబ్బలులో విశాఖ వ్యాలీ స్కూల్‌ విద్యార్థులు

ఆరిలోవ : విశాఖ వ్యాలీ స్కూల్‌ హెరిటేజ్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో భౌగోళిక అవగాహన యాత్ర పేరుతో విద్యార్థులు పురాతన పర్యాటక ప్రాంతం ఎర్రమట్టి దిబ్బలను బుధవారం సందర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఈశ్వరి ప్రభాకర్‌ ఆదేశాలతో 59 మంది విద్యార్థులను ఈ అవగాహన యాత్రకు తీసుకెళ్లారు. ఇక్కడ భౌగోళిక వనరులపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ సందర్శనలో పాల్గొన్న జిల్లా ఇంటక్‌ కన్వీనర్‌ రాజశేఖర్‌రెడ్డి, సభ్యురాలు రేణుకా రాణి ఎర్రమట్టి దిబ్బల చరిత్ర వివరించారు. ఎర్రమట్టి దిబ్బలు 12 వేల సంవత్సరాల కిందట ఏర్పడినట్లు భౌగోళిక ఆధారాలను బట్టి తెలుస్తుందన్నారు. ఇక్కడ 650 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నట్లు తెలిపారు. ఇక్కడి ఎర్రమట్టి దిబ్బలను భారత ప్రభుత్వం 2014లో భౌగోళిక వారసత్వ ప్రదేశంగా గుర్తించిందన్నారు. ఇలాంటి భౌగోళిక ప్రదేశాలు ప్రపంచంలో సౌదీ అరేబియా, నమీబియాలో ఉన్నాయన్నారు. సందర్శనలో హెరిటేజ్‌ క్లబ్‌ నిర్వాహకుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలు కుమారి, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌సిటీలో రోగి బంధువుల ఆందోళన

ఆరిలోవ: హెల్త్‌సిటీ ఎంవీ ఆస్పత్రిలో బుధవారం ఓ రోగి బంధువులు ఆందోళనకు దిగారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా వేపాడ మండలానికి చెందిన డి.కృష్ణ ఇటీవల కిడ్నీలో రాళ్ల సమస్యతో ఆస్పత్రిలో చేరాడు. ఇక్కడ వైద్యులు ఈ నెల 28న కిడ్నీలో రాళ్లు తొలగించడానికి ఆపరేషన్‌ చేశారు. ఆపరేషన్‌ జరిగిన గంటన్నర వరకు రోగిని బంధువులకు చూపించలేదు. అనంతరం పేషెంట్‌ను బంధువులకు చూపించారు. అప్పటి నుంచి పేషెంట్‌కు బుధవారం కూడా మెలుకువ రాలేదు. దీంతో సర్జరీ చేసిన సమయంలో ఎనస్తీషియా ఎక్కువ మోతాదులో ఇచ్చారని, అందుకే పేషెంట్‌కు ఇంత వరకు మెలకువ రాలేదని బంధువులు వైద్యులను నిలదీశారు. దీంతో వైద్యులు పేషెంట్‌ను పరిశీలించి కార్డియాక్‌ అరెస్టు జరిగిందని వివరించారు. దీంతో బంధువులు ఆందోళనకు దిగడంతో ఆస్పత్రి నిర్వాహకులు మెరుగైన వైద్యం కోసం పేషెంట్‌ను నగరంలో వేరే ఆస్పత్రికి తరలించారు. అక్కడ వెంటిలేటర్‌పై ఉంచినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం అతని పరిస్థితి బాగానే ఉందన్నారు. ఆ పేషెంట్‌కు అయ్యే వైద్య ఖర్చులు ఆస్పత్రి భరిస్తుందని రాతపూర్వకంగా తెలపడంతో బంధువులు ఆందోళన విరమించారు.

విద్యుత్‌ సరఫరాకు నేడు అంతరాయం

మద్దిలపాలెం : మద్దిలపాలెం శివాలయం ఫీడర్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్‌ ఏఈఈ హేమతార తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ మద్దిలపాలెం, భానునగర్‌, క్రిష్టా కళాశాల, కేఆర్‌ఎం కాలనీ, శివాలయం, సీఎంఆర్‌ శ్మశానం ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపి వేస్తున్నామని తెలిపారు.

అలరిస్తున్న జలకన్యలు

- ప్రజలు.. పర్యాటకులు ఫిదా
- కళ్ల ముందు కథలు.. సినిమాల్లో చూసిన దృశ్యాలు ప్రత్యక్షం
- అబ్బురం కలిగిస్తున్న ప్రదర్శన


పర్యాటకుల చెంతన జలకన్య


నీటిలో చేపలా ఈదుతున్న జలకన్య

ఏయూక్యాంపస్‌ : చిన్నప్పుడు పెద్దలు చెప్పే కథల్లో, తెరపై చూసిన సినిమాల్లో జలకన్యలు ఉంటారని తెలుసుకున్నాం. అటువంటి జల కన్యలు మన కళ్ల ముందుకు వస్తే.. వారు నీటిలో సరదాగా ఈదుతుంటే చూడటానికి అందరూ ఆసక్తి చూపుతారు. పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో మరింత పర్యాటక ఆసక్తిని పెంచే విధంగా విశాఖ ఎక్స్‌ పో నిలిచింది. బీచ్‌రోడ్డు పోలీస్‌ మెస్‌ వెనుక భాగంలో ఏర్పాటు చేసిన విశాఖ ఎక్స్‌పోలో మెర్‌మైడ్స్‌ (జలకన్యల) విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

గత ఏడాది ఫిష్‌ టన్నెల్‌.. ఈ ఏడాది మెర్‌మైడ్స్‌..

విశాఖలో ప్రతి సంవత్సరం వివిధ రూపాలతో ప్రత్యేకంగా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తుంటారు. గత ఏడాది ప్రత్యేకంగా ఫిష్‌ టన్నెల్‌ అక్వేరియం ఏర్పాటు చేశారు. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. దీంతో నిర్వాహకులు మరింత ఉత్సాహంగా ఈ సంవత్సరం మెర్‌మైడ్స్‌ ప్రదర్శన తీసుకువచ్చారు. జలకన్యల ప్రదర్శన కోసం ప్రత్యేకంగా రెండు అద్దాల మినరల్‌ వాటర్‌ (పది అడుగులపై లోతు) కలిగిన నీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. పారదర్శకంగా ఉండే ఈ ట్యాంకుల్లో నుంచి జలకన్యలను పర్యాటకులు వీక్షించే అవకాశం ఉంది. ఒక్కో ట్యాంకులో 40 వేల లీటర్ల మినరల్‌ వాటర్‌ నింపుతారు. ప్రతిరోజు ఈ నీటిని మారుస్తారు. నీటి ఉష్ణోగ్రత 28 డిగ్రీలు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకుంటారు.

ప్రత్యేక ఏర్పాట్లు..

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ పారదర్శకమైన నీటి ట్యాంకుల్లో జలకన్యలు దిగుతారు. వాటర్‌ ప్రూఫ్‌ దుస్తులు, రెండు కాళ్లకు దిగువన చేప ఆకారంలో ఉండే వస్త్రాలు ధరిస్తారు. కళ్లలోకి నీరు వెళ్లకుండా ప్రత్యేకమైన గాగుల్స్‌ వేసుకుంటారు. వీరు చూడటానికి మనిషిలా, కాళ్లు చేప తోక రూపంలో ఉంటూ నిజమైన జలకన్యల్లా కనిపిస్తారు. ముఖానికి ఎటువంటి ఆక్సిజన్‌ మాస్కులు లేకుండా వీరు నీటిలో ఈత కొడతారు. నీటి అడుగున దాదాపు 2 నుంచి 3 నిమిషాలు ఉంటారు. తిరిగి పైకి వచ్చి గాలి పీల్చుకుని మళ్లీ నీటిలోకి వెళతారు.

నగరవాసులు.. పర్యాటకులు ఫిదా..

నీటిలో ఈత కొడుతూ వీరు చుట్టూ ఉన్న పర్యాటకులను అలరిస్తారు. చిన్నారులకు ఎయిర్‌ కిస్‌లు విసురుతూ ఉత్సాహపరుస్తారు. దీంతో వీరిని వీక్షించడానికి వచ్చే సందర్శకుల కేరింతలతో ఈ ప్రాంగణం ఉత్సాహంగా మారిపోతుంది. వీరి విన్యాసాలకు నగరవాసులు, పర్యాటకులు ఫిదా అయిపోతున్నారు.



విదేశాల నుంచి..

ఇక్కడ విన్యాసాలు చేస్తున్న యువతులు ఫిలిప్పీన్స్‌, అస్ట్రేలియా దేశాల నుంచి వచ్చారు. వీరు ప్రత్యేకంగా తమ దేశంలో ఈతలో శిక్షణ తీసుకుంటారు. ఈ దేశాల్లో వీటికి ప్రత్యేకంగా కోర్సులు కూడా ఉన్నాయి. వీరు శిక్షణ పొంది నైపుణ్యం సాధించిన తర్వాత జలకన్యలుగా ప్రదర్శనలు ఇస్తుంటారు. కష్టమైన వృత్తి కావడంతో వీరికి వేతనాలు భారీగా ఉంటాయి. వీటితో పాటు వీరికి విమాన టిక్కెట్లు, స్థానికంగా వసతి సైతం నిర్వాహకులే కల్పిస్తారు. అదే విధంగా వీరికి ప్రత్యేకమైన డైట్‌, వీరికి అవసరమైన విధగా ఒక ఫిజిషియన్‌ని నిర్వాహకులు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 10 గంటల వరకు ఎక్స్‌పో ఆవరణలో వీరి ప్రదర్శన నిర్వహిస్తున్నారు.

మెయిన్‌డ్రా టెన్నిస్‌ పోటీలు ప్రారంభం


డ్రాప్‌ షాట్‌ చేస్తున్న నగేష్‌


బంతిని రిటెన్‌ చేస్తున్న సౌమిత్రి

విశాఖ స్పోర్ట్స్‌: ఆలిండియా సీనియర్‌ టెన్నిస్‌ టోర్నీ(ఐస్టా) మెయిన్‌ డ్రా పోటీలు గురువారం ఆఫీసర్స్‌ క్లబ్‌లో ప్రారంభమయ్యాయి. సీనియర్స్‌ రాంకింగ్‌ ఆటగాళ్లతో పాటు క్వాలిఫైయింగ్‌ రౌండ్లలో అర్హత సాధించిన వారు 35+–75+ వరకు ఐదు కేటగిరిల్లో సింగిల్స్‌, డబుల్స్‌ విభాగాల్లో పోటీపడుతున్నారు. అండర్‌ 45+లో హోరాహోరీగా సాగిన రెండో రౌండ్‌ బి.నవీన్‌, కెఆర్‌కే కుమార్‌లు చెరో ఎనిమిదేసి పాయింట్లతో సముజ్జీగా నిలవగా టై బ్రేక్‌లో నవీన్‌ విజయం సాధించి క్వార్టర్‌ ఫైనల్‌కు చేరుకున్నాడు. మరో పోటీలో క్వాలిఫైయిర్‌తో తలపడిన శంకర్‌నాయుడు 9–4తో విజయం సాధించాడు. 35+లో నితీష్‌ జాక్సన్‌తో కిరోన్‌ సముజ్జీగా నిలవగా టై బ్రేక్‌లో కిరోన్‌ విజయం సాధించి క్వార్టర్‌ ఫైనల్స్‌కు చేరాడు. పి.అనిల్‌పై వై.సురేష్‌, దీపు చంద్రపై సచిన్‌శర్మ, అమిత్‌రెడ్డిపై రెండో సీడ్‌ కర్సన్‌సేతు విజయం సాధించి క్వార్టర్స్‌కు చేరుకోగా నగేష్‌ సునాయాసంగానే నగేష్‌రెడ్డిపై విజయం సాధించాడు. 55+లో గంగాధర్‌పై శివషణ్ముగం, మహేష్‌ కేశవ్‌పై రమేష్‌ విజయం సాధించగా టాప్‌ సీడ్‌ సుధాకర్‌రెడ్డి 9–2తో లూయిస్‌పై విజయం సాధించాడు.